





నగరంలో అకాల వర్షం

- నేడు 8 జిల్లాలకు వర్షసూచన

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత నెల రోజులుగా వేసవిని తలపించే ఎండలతో అల్లాడిన నగరవాసులకు మంగళవారం ఉదయం కుండపోతగా కురిసిన అకాల వర్షం కాస్త ఊరట కలిగించింది. పెనుగాలులతో కురిసిన ఈ వర్షానికి నగరమంతా రోడ్లపై వర్షపునీరు వరదలా ప్రవహించింది.. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో కొద్దిసేపు కురిసిన వర్షం, మధ్యాహ్నం 12.30 గంటల దాకా తెరిపిచ్చినట్లే ఇచ్చి మళ్ళీ పలు ప్రాంతాల్లో కురిసింది. అదే సమయంలో ఈ వర్షాల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించిన కన్నియాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి జిల్లాల్లో ఇక స్థానిక వాతావరణ కేంద్రం అధికారులు అంచనా ప్రకారమే మంగళవారం వర్షాలు కురిశాయి. తిరునల్వేలిలోని జంక్షన్, టౌన్, వన్నారపేట, పాళయంకోట మార్కెట్, సమాధానపురం, మహారాజనగర్, కేటీసీటీ నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తరుగా వర్షాలు కురిశాయి. గంగైకొండాన్, చేరన్‌మాదేవి తదితర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి. కలెక్టర్ సుకుమార్ ఇతర అధికారులు వర్షబాధిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇదే విధంగా తూత్తుకుడి జిల్లాలోని తూత్తుకుడి నగరం, విలాత్తికుళం, ముత్తయ్యాపురం తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం పెనుగాలులతో చెదురుమదురుగా వర్షం కురిసింది. దీంతో అధికారుల హెచ్చరిక మేరకు సుమారు 500 మంది జాలర్లు చేపలవేటకు వెళ్లలేదు.. తెన్‌కాశి జిల్లాల్లో కురిసిన వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నీట మునిగింది.

బుధవారం వేకువజాము నుండి సాయంత్రం వరకు విరుదునగర్, శివగంగ, మైలాడుదురై, తంజావూరు, పుదుకోట, రామనాథపురం, తిరువారూరు, నాగపట్టినం జిల్లాల్లో భారీగా, మరికొన్ని జిల్లాలో చెదురుముదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. చెన్నై నగరంలో ఆకాశం మేఘావృతమై చెదురుముదురుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు.

ఆ విద్యార్థినికి ఎంత కష్టం...

- కొద్దిసేపట్లో పరీక్ష అనగా తండ్రి మృతి
- పుట్టెడు దుఃఖంతోనే హాజరు



పరీక్షకు వెళ్తూ తండ్రి మృతదేహానికి నమస్కరిస్తున్న విద్యార్థిని

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చిన్న వయసులో ఎంత కష్టమొచ్చింది..! మరికొద్దిసేపట్లో ప్లస్‌టూ పరీక్షకు హాజరుకావాల్సివుండగా తండ్రి కన్నుమూశాడు. పుట్టెడు దుఃఖం ముంచుకొస్తున్నా.. గుండెను దిటవు చేసుకున్న ఆ బాలిక... కన్నీటిని ఆపుకుంటూ, భవితను వెతుక్కుంటూ ప్లస్‌టూ పరీక్షకు హాజరైంది. తిరునల్వేలి జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ... దిశన్‌విలై తాలూకా ఇట్టమొలి సమీపం వడవిలై గ్రామానికి చెందిన అయ్యాదురై (55)-భానుమతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో మూడో కుమార్తె మధుమిత ప్లస్ టూ చదువుతోంది. క్యాన్సర్‌తో బాధపడుతున్న అయ్యాదురై మంగళవారం వేకువజామున మృతి చెందాడు. మధుమిత మరికొద్దిసేపట్లో గణితం పరీక్ష రాయాల్సి ఉంది. అయ్యాదురై మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి తీసుకొచ్చారు. దీంతో కుటుంబీకులు, బంధువులంతా దుఃఖసాగరంలో మునిగిపోయారు. అప్పటి వరకూ గుండెలవిసేలా రోదించిన మధుమితకు.. గతంలో తండ్రి చెప్పిన మాటలు స్మరణకొచ్చాయో, లేక కర్తవ్యం గుర్తుకొచ్చిందో గానీ.. హాల్‌టిక్కెట్‌తో పరీక్షకు వెళ్లేందుకు సిద్ధమైంది. తండ్రి భౌతిక కాయానికి నమస్కరించి పరీక్షకు హాజరైంది. ఆమె పరీక్ష నుంచి వచ్చాక అయ్యాదురైకి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన పలువురిని కంట తడిపెట్టింది.



సభలో లబ్ధిదారులకు సహాయాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి

మీ మాట వినకుంటే నిధులు ఆపేస్తారా?

- ఇలాంటి కేంద్రప్రభుత్వాన్ని చూడడం తమిళులకిదే ప్రథమం
- త్వరలోనే తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం
- లోక్‌సభలో రాష్ట్ర ఎంపీల పోరాటం భేష్
- చెంగల్పట్టు సభలో సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య దేశంలో ఓ విద్యావిధానాన్ని ఆమోదించకపోతే నిధులను ఆపేస్తామంటూ బెదిరించే కేంద్ర ప్రభుత్వాన్ని తొలిసారిగా తమిళ ప్రజలు చూస్తున్నారని, త్వరలో వారికి తగిన గుణంపాఠం చెప్పేందుకు కూడా సిద్ధంగా ఉన్నారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. హిందీ, సంస్కృత భాషలను నిర్బంధంగా అమలు చేయడం, విద్యను ప్రైవేటుపరం చేయడం, ధనవంతులకే ఉన్నతవిద్యావకాశాలు కల్పించడం, విద్యలో మతతత్త్వ వాదాన్ని జొప్పించడం వంటి విద్యా వ్యతిరేక విధానాలను ప్రతిపాదించే జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు. చెంగల్పట్టులో మంగళవారం ఉదయం జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ఆ జిల్లాలో రూ.280.38 కోట్లతో పూర్తయిన పథకాలను ప్రారంభించి, రూ.497.06 కోట్లతో చేపట్టనున్న కొత్త పథకాలకు శంకుస్థాపన చేసి, పలువురు లబ్ధిదారులకు సహాయాలు అందజేశారు. అనంతరం సీఎం ప్రసంగిస్తూ.. లోక్‌సభలో సోమవారం డీఎంకే ఎంపీలు అనుసరించిన తీరు, కేంద్రంపై చేసిన విమర్శలు ప్రశంసనీయమని, ప్రత్యేకించి విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళ ఎంపీలను అనాగరికులంటూ చేసిన విమర్శలను ఖండించిన తీరు కూడా సమర్థనీయమన్నారు. రాష్ట్ర విద్యాహక్కులను కాపాడుకునేలా లోక్‌సభలో ఎంపీలు చేసిన వాదనల ఈ సభా ముఖంగా ప్రశంసించడంతో పాటు వారికి ధన్యవాదాలు తెలిపారు. తమిళుల ఆత్మ గౌరవానికి భంగం కలిగితే చూస్తూ ఊరుకోరని దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి చెబుతుండేవారని, ఆ రీతిలోనూ డీఎంకే ఎంపీలు తమిళుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేలా లోక్‌సభలో పాలకపక్షాన్ని నిలదీశారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నుండి జాతీయ విద్యావిధానం పేరిట ఏర్పడనున్న ముప్పును ముందస్తుగానే గ్రహించి ఆ విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని, ఈ ఉద్యమానికి తమిళ ప్రజలంతా గట్టి మద్దతు ఇవ్వాలని స్టాలిన్ పిలుపునిచ్చారు.

సెయ్యూరులో సిప్కాట్ పార్క్...

చెంగల్పట్టు జిల్లాను పారిశ్రామికంగా మరింతగా అభివృద్ధి పరిచేందుకు సెయ్యూరులో 800 ఎకరాల్లో కొత్త సిప్కాట్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, దామో అన్బరసన్, ఎంపీలు టీఆర్ బాలు, సెల్వం, శాసనసభ్యులు వరలక్ష్మి, రాజా, ఇ.కరుణానిధి, అరవింద్ రమేష్, బాలాజీ, బాబు, రెవెన్యూ శాఖ అదనపు ప్రభుత్వ కార్యదర్శి అముదా, కమిషనర్ పళనిస్వామి, జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సారి రెండాకుల గుర్తుపైనే పోటీ

- మాజీ మంత్రి వైద్యలింగానికి శశికళ భరోసా



వైద్యలింగంను పరామర్శిస్తున్న శశికళ, ఆమె సోదరుడు దివాకరన్

టి.నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది శాసనసభ ఎన్నికల్లో రెండాకుల గుర్తుపైనే పోటీ చేసి గెలుద్దామంటూ మాజీ సీఎం పన్నీర్ సెల్వం (ఓపీఎస్) అనుచరుడు, మాజీ మంత్రి వైద్యలింగానికి శశికళ భరోసా ఇచ్చారు. ఇటీవల వైద్యలింగం తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది తంజావూరు జిల్లా ఒరత్తనాడు సమీపం తెలుంగన్‌కుడికాడులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న శశికళ మంగళవారం తన సోదరుడు దివాకరన్‌తో కలిసి వైద్యలింగం నివాసానికి వెళ్ళి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ ఎలాంటి దిగులు పడాల్సిన అవసరం లేదని, వచ్చే యేడాది సరికి అందిరికీ మంచిరోజులు వస్తాయని, అసెంబ్లీ ఎన్నికల్లో రెండాకుల గుర్తుపైనే పోటీ చేయడం ఖాయమని భరోసా ఇచ్చారు. మళ్ళీ రాష్ట్రంలో జయ పాలన రావటం తథ్యమని కూడా శశికళ ప్రకటించారు. ప్రస్తుతం వైద్యలింగంతో శశికళ భేటీ కావటం సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతోంది.

కొనసాగుతున్న వివాదం

- యూజీసీ ప్రతినిధి లేని సెర్చ్ కమిటీని ఉపసంహరించుకోండి
- వీసీ నియామకంలో గవర్నర్ ఆదేశం

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఉప కులపతి నియామకానికి సంబంధించి యూజీసీ ప్రతినిధి లేకుండా ఏర్పాటుచేసిన సెర్చ్ కమిటీని ఉపసంహరించుకోవాలని, యూజీసీ ప్రతినిధితో ఛాన్సలర్ ఏర్పాటుచేసిన సెర్చ్ కమిటీని ఆమోదిస్తూ నోటిఫికేషన్ ఇవ్వాలని గవర్నర్ ఆర్ఎన్ రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ మేరకు రాజ్‌భవన్ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ హోదాలో గవర్నర్ తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ విశ్వవిద్యాలయానికి కొత్త వైస్ ఛాన్సలర్ నియామకానికి సెర్చ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ సెర్చ్ కమిటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ జనవరి 28న ఉత్తర్వులు జారీచేసింది. ఈ నోటిఫికేషన్‌లో యూజీసీ ప్రతినిధిని తొలగించారు. యూజీసీ నిబంధన ప్రకారం ఏర్పాటైన సెర్చ్ కమిటీ సూచన మేరకు యూనివర్శిటీల్లో వైస్ ఛాన్సలర్ నియామకం జరగాలని ప్రొఫెసర్ పీఎస్ శ్రీజిత్-డా.ఎంఎస్ రాజశ్రీ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. యూజీసీ ప్రతినిధి లేకుండా సెర్చ్ కమిటీని ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం

మరియు స్పోర్ట్స్ యూనివర్శిటీ నిబంధనలు, యూజీసీ నిబంధన ప్రకారం, సెర్చ్ కమిటీలో ఛాన్సలర్ ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి, యూనివర్శిటీ సెనెట్ ప్రతినిధి, యూజీసీ ప్రతినిధి ఉంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, రాష్ట్ర విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ సెర్చ్ కమిటీలో యూజీసీ ప్రతినిధి ఉండడం తప్పనిసరి. యూజీసీ ప్రతినిధి సహా నలుగురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్ ఇవ్వాలని గత ఏడాది అక్టోబరు 24న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసులో ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ



యూజీసీ నిబంధనలు, సుప్రీంకోర్టు ఆదేశాలకు పూర్తిగా విరుద్ధమని గవర్నర్ పేర్కొన్నారు. అందువల్ల యూజీసీ ప్రతినిధి లేకుండా సెర్చ్ కమిటీని నియమిస్తూ జారీచేసిన నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని, యూజీసీ ప్రతినిధితో ఛాన్సలర్ నియమించిన సెర్చ్ కమిటీకి సంబంధించిన నోటిఫికేషన్ జారీచేయాలని గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు రాజ్‌భవన్ ప్రకటనలో తెలిపింది.

వీసీల నియామకంలో సమస్యలు..

కొత్త వైస్ ఛాన్సలర్ సెర్చ్ కమిటీలో యూజీసీ ప్రతినిధికి చోటు కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య వివాదం కొనసాగుతోంది. మద్రాసు యూనివర్సిటీ, తమిళనాడు యూనివర్సిటీ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్, కోయంబత్తూర్ భారతీయార్ యూనివర్సిటీలకు కొత్తగా వీసీలను నియమించడంలో సమస్యలు తలెత్తాయి. అదే సమయంలో, ఈ వ్యవహారానికి సంబంధించిన కేసులు సుప్రీంకోర్టులో పెండింగ్ వున్న విషయం తెలిసిందే.

‘పునర్విభజన’ లాభ నష్టాలపై సదస్సు

- ఒడిశా మాజీ సీఎంకు ఆహ్వానం
- 7 రాష్ట్రాలకు చెందిన 29 పార్టీలకు పిలుపు

అడయార్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్థానాల పునర్విభజన వలన జరిగే లాభనష్టాలపై చర్చించేందుకు ఈ నెల 22వ తేదీ సీఎం స్టాలిన్ అధ్యక్షతన నిర్వహించనున్న దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 29 రాజకీయ పార్టీల నేతల సదస్సుకు హాజరుకావాలని ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను డీఎంకే ఎంపీ దయానిధి మారన్, రాష్ట్ర మంత్రి టీఆర్‌బీ రాజా స్వయంగా నవీన్ పట్నాయక్‌కు అందజేశారు. 2026 తర్వాత చేపట్టే జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన చేయాలని కేంద్రం భావిస్తుంది. ఇదే జరిగే కుటుంబ నియంత్రణ సమర్థవంతంగా అమలు చేయడం వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా సంఖ్య ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే తక్కువగా ఉంది. దీంతో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో తమ వ్యతిరేకతను ఆయన ఇప్పటికే తెలిపారు. అదేసమయంలో ఈ పునర్విభజన వల్ల కలిగే లాభనష్టాలపై చర్చించేందుకు ఈ నెల 22న నగరంలో సీఎం స్టాలిన్ దక్షిణాది రాష్ట్రాల సహా ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన ఆహ్వానం పలుకుతున్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులతోపాటు ఆయా రాష్ట్రాల్లోని 29 రాజకీయ పార్టీల నేతలను ఆయన ఆహ్వానించారు. ఈ ఆహ్వాన పత్రికలు డీఎంకే ఎంపీలు, మంత్రులు స్వయంగా వెళ్ళి అందజేస్తున్నారు. ఇందులో భాగంగా, నవీన్ పట్నాయక్‌కు దయనాధి మారన్, టీఆర్‌బీ రాజా అందజేసి, ఈ సదస్సులో పాల్గొనాలని ఆహ్వానించారు. అలాగే, నేడు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు రాష్ట్ర మంత్రి పొన్ముడి, ఎంపీ అబ్దుల్లా వెళ్ళి ఆహ్వానించనున్నారు.

ఈ నెల 13వ తేదీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడికి రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ, ఎంపీ ఎన్ఆర్ ఇళంగోలు హైదరాబాద్ వెళ్ళి ఆహ్వాన పత్రిక అందజేయనున్నారు.



నవీన్ పట్నాయక్‌ను ఆహ్వాన పత్రం అందజేస్తున్న దయానిధి మారన్

బోర్డులు తమిళంలో ఉండాలి

హెచ్చరించిన జీసీసీ

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమిళంలో 'నేమ్ బోర్డులు' లేని దుకాణాలపై చర్యలు చేపట్టేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) సిద్ధమవుతోంది. పారిశ్రామిక సంస్థలు, దుకాణలు తమ నేమ్ బోర్డుల్లో పెద్ద సైజులో తమిళం, దాని కంటే చిన్నగా ఇంగ్లీషు, దానికి తక్కువ సైజులో ఆసక్తి ఉన్న, ఇతర భాషల్లో పేర్లుండాలని నిబంధన ఉంది. కానీ ఈ నిబంధనను పలు దుకాణ యజమానులు పాటించడం లేదని, నేమ్ బోర్డుల్లో ఇంగ్లీషు, హిందీ తదితర భాషల పేర్లు పెద్దవిగా ఏర్పాటుచేస్తున్నారని జీసీసీకి ఫిర్యాదులు అందుతున్నాయి. జీసీసీ పరిధిలో సుమారు 70వేల దుకాణాలున్నాయి. కాగా, ప్యారీస్, షావుకారుపేట తదితర ప్రాంతాల్లోని దుకాణాల నేమ్ బోర్డులు తమిళంలో లేవని తేలింది. అలా, తమిళంలో పేర్లు ఏర్పాటుచేయని దుకాణ యజమానులకు తొలుత సంజాయిషీ కోరుతూ నోటీసు పంపాలని అధికారులు నిర్ణయించారు. వారం రోజుల్లోగా ఈ విషయమై సంజాయిషీ ఇవ్వని దుకాణాల లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. చెన్నై, కోవై, మదురై, తిరుచ్చి, సేలం, తిరునల్వేలి తదితర ముఖ్యమైన నగరాల్లో కూడా తమిళంలో పేరు నేమ్ బోర్డులో తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని, ఈ నిబంధన పాటించని దుకాణ యజమానులపై చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, మంగళవారం జరిగిన సమావేశంలో, తమిళంలో పేర్లు లేని దుకాణాలకు నోటీసులు జారీచేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.26
సహర్ (గురువారం) : 4.37

సమాచార దర్శిని

సైనికాధికారులుగా పనిచేసేందుకు అవకాశం

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ సర్టిఫికెట్ పొందిన వారు, యుద్ధ అమరవీరుల వారసులు సైనికాధికారులుగా పనిచేసేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. 19 నుంచి 25 ఏళ్లలోపున్న వారు, ఏదైనా ఓ డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు కావాల్సిఉంది. దరఖాస్తులను ఈ నెల 15వ తేది వరకు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు www.joinindianarmy.nic.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

15న 'చాట్ జీపీటీ'పై శిక్షణ

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్త అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న 'చాట్ జీపీటీ'పై శిక్షణ ఇవ్వనున్నారు. చాట్ జీపీటీ పరియం, లక్ష్యాలు, మార్కెటింగ్, బ్రాండింగ్ స్టేటర్జీ సహా పలు అంశాలపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు www.ediitn.in అనే వెబ్‌సైట్, 9080609808, 9677152265 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

తిరుచ్చి-తాంబరం ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం తిరుచ్చి-తాంబరం-తిరుచ్చి మధ్య ప్రత్యేక వారాంతపు రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06190 తిరుచ్చి-తాంబరం ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 4 నుంచి 27వ తేది వరకు (శుక్ర, శని, ఆదివారాలు) తిరుచ్చిలో ఉదయం 5.35 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. మారు మార్గంలో నెం.06191 తాంబరం-తిరుచ్చి ప్రత్యేక వారాంతపు రైలు ఏప్రిల్ 4 నుంచి 27వ తేది వరకు (శుక్ర, శని, ఆదివారాలు) తాంబరంలో మధ్యాహ్నం 3.45 గంటలకు బయల్దేరి రాత్రి 10.40 గంటలకు తిరుచ్చి చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ల రిజర్వేషన్ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

మెట్రో రైల్వేస్టేషన్లలో అదనపు ఎస్కలేటర్లు

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉన్న మెట్రో రైల్వేస్టేషన్లలో అదనంగా 42 ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు.. ఆ ప్రకారం, 30 మెట్రో రైల్వేస్టేషన్లలో రూ.42 కోట్లతో ఎస్కలేటర్లు ఏర్పాటు కానున్నాయి. గిండి, ఎగ్మూర్, తిరుమంగళం, అన్నానగర్, ఆలందూర్, కోయంబేడు, డీఎంఎస్, నందనం సహా పలు స్టేషన్లలో ఎస్కలేటర్ల ఏర్పాటుపనులు 30 శాతం ముగిశాయని, మరో మూడు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆదిద్రావిడ గృహ వసతి, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టెన్త్, ప్లస్ టూ తరగతుల్లో ఉత్తీర్ణులైన ఆదిద్రావిడ, గిరిజన వర్గాలకు చెందిన విద్యార్థులు హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో యూజీ, డిప్లొమో కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. టెన్త్, ప్లస్ టూ తరగతుల్లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, ఏడాదికి రూ.3 లక్షల కుటుంబ ఆదాయం ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు. కోర్సు పూర్తయిన తర్వాత ఫైవ్ స్టార్ హోటళ్లు, ప్రభుత్వ హోటళ్లలో ఉద్యోగావకాశం కల్పిస్తారు. దరఖాస్తుల సమర్పణ, ఇతర వివరాలకు www.tahdco.com అనే వెబ్‌సైట్ సమర్పించవచ్చు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేలా 'నాన్ ముదల్వన్ ఫినిషింగ్ స్కూల్, ప్రధాన మంత్రి శిక్షణా పథకాలు అమలులో ఉన్నాయి. నాన్ ముదల్వన్ ఫినిషింగ్ స్కూలులో 16-35 ఏళ్ల యువతకు స్వల్పకాలిక శిక్షణ, ఉపాధి కల్పించనున్నారు. ప్రధాన మంత్రి శిక్షణ పథకంలో, సాఫ్ట్‌వేర్ సహా వివిధ రంగాల్లో 12 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు 21-24 ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొనవచ్చు. గిండిలోని ప్రభుత్వ ఐటీఐ శిక్షణా కేంద్రంలో సోమవారం నుంచి, ఉత్తర చెన్నై శిక్షణా కేంద్రంలో మంళవారం నుంచి శిక్షణ ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులుంటాయి. శిక్షణ పొందిన వారికి నెలకు రూ.5,000 ప్రోత్సాహకం, రూ.6,000 ఒకేసారి గ్రాంట్‌గా అందజేస్తారు. మరిన్ని వివరాలకు 044-25 201163, 7358274627, 9946640017 అనే నెంబర్లు సంప్రదించవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

మినీ బస్సులకు 8 మందికి అనుమతి

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాల్లో మినీ బస్సులు నడిపేందుకు తొలి విడతగా 8 మందికి అనుమతించినట్లు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. సాధారణ బస్సులు వెళ్లలేని మార్గాల్లో ప్రైవేటు భాగస్వామ్యంతో మినీ బస్సులు నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, నగరం, శివారు ప్రాంతాల్లో 72 మార్గాలు ఎంపిక చేసి, ఆసక్తి కలిగిన వారి నుంచి టెండర్లు ఆహ్వానించారు. ఆ ప్రకారం, ఉత్తర చెన్నై, ఈశాన్య చెన్నై ప్రాంతాల్లో ఎంపిక చేసిన నాలుగు మార్గాలకు తలా ఇద్దరు టెండర్లు వేశారు. ఈ టెండర్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్, సోమవారం నాలుగు మార్గాల్లో మినీ బస్సులు నడిపేందుకు అనుమతిచ్చారు. బస్సులకు సంబంధించిన అన్ని పత్రాలు ఏప్రిల్ 30వ తేది లోపు సమర్పించాలని, మే 1వ తేది నుంచి ఈ బస్సులు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.



బీజేపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు - సీఎం చిత్రపటాన్ని చెప్పుతో కొట్టేందుకు యత్నిస్తున్న కార్యకర్తలు

డీఎంకేకి వ్యతిరేకంగా బీజేపీ ఆందోళన

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొల్లాచ్చిలో డీఎంకే వైఖరిని ఖండిస్తూ బీజేపీ చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యులపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తూ డీఎంకే ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టారు. ధర్నాలో కార్యక్రమంలో కేంద్ర మంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేయడంతో పాటు పశువు మెడలో ఆయన చిత్రపటాన్ని ఉంచి నిరసన జరిపారు. డీఎంకే కార్యకర్తల తీరును ఖండిస్తూ మంగళవారం పొల్లాచ్చి గాంధీ విగ్రహం సమీపంలో బీజేపీ కోవై దక్షిణ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. అనుమతి లేకుండా ఆందోళన చేపడుతున్నారంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసులతో కార్యకర్తలు వాగ్వివాదానికి దిగగా, ఇరువర్గాల మధ్య స్వల్పంగా తోపులాట జరిగింది. ఈ తోపులాటలో సీఐ కిందపడ్డారు. అంతలో కార్యకర్తలు ముఖ్యమంత్రి స్టాలిన్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు ఆందోళన చేసిన నేతలు, కార్యకర్తలు వంద మందిని అరెస్ట్ చేసి సమీపంలోని కల్యాణ మండపానికి తరలించారు.

త్రిభాషా విద్యావిధానానికి 10 లక్షల మందికి పైగా మద్దతు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ప్యారీస్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విద్యావిధానానికి మద్దతుగా బీజేపీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి రోజురోజుకు ప్రజల మద్దతు పెరుగుతోందని, ఇప్పటివరకు 10 లక్షల సంతకాలు సేకరించామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ప్రకటించిన త్రిభాషా విద్యావిధానం గురించి డీఎంకే సహా మిత్ర పక్షాలు ప్రజలను తప్పుదారి పట్టించేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ పాఠశాలల్లో పలు భాషలకు సంబంధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు చదువుతున్నారని, అయితే ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం గత 60ఏళ్ళుగా ద్విభాషా విద్యావిధానాన్నే రాష్ట్రప్రభుత్వం కొనసాగిస్తోందని ఇందువల్ల ఈ పాఠశాలల్లో చదువుకుంటున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు తమిళం, ఆంగ్లలపై ప్రావీణ్యంలేక నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. త్రిభాషా విద్యావిధానానికి మద్దతుగా బీజేపీ తరుపున చేపట్టిన సంతకాల సేకరణోద్యమాన్ని నీరుగార్చేందుకు ద్రావిడ పార్టీలు ఎన్ని ప్రయత్నాలు చేసినా, తాము కోటి సంతకాలు సేకరించే వరకు ఈ ఉద్యమాన్ని ఆపబోమన్నారు.

హుండీ ఆదాయం ఆలయాలకే

● స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో హుండీల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయాల అభివృద్ధికి ఖర్చుచేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆలయాల హుండీల ద్వారా వచ్చిన రూ.445 కోట్ల ఆదాయాన్ని దేవాలయం, మసీదు నిర్మాణాలకు తమిళనాడు ప్రభుత్వం వినియోగిస్తోందనే ఓ వార్త సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేస్తోంది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం తన అధికారిక సామాజిక మాధ్యమంలో స్పందిస్తూ... ఈ వార్త పూర్తిగా అవాస్తమని, పోస్టర్‌లో షేర్ చేసి ఫొటోకు రాష్ట్రానికి ఎలాంటి సంబంధం లేదు. కర్ణాటక రాష్ట్రంలోని ఆలయాల్లో వసూలైన హుండీల నిధులకు సంబంధించి ఈ వార్త కనిపిస్తోంది. ఈ వార్తకు తమిళనాడును జోడించి తప్పుగా దుష్ప్రచారం చేస్తున్నారు. తమిళనాడు హిందూ దేవాదాయ శాఖ ఆలయాలకు వచ్చే ఆదాయం, ఆలయాలు, హిందూ మతపరమైన కార్యక్రమాలకు మాత్రమే ఖర్చుచేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

1,336 ఇళ్ల పునర్నిర్మాణాలకు రూ.215 కోట్లు

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై అభివృద్ధి పథకంలో శిథిలావస్థకు చేరిన 1,335 ఇళ్ల పునర్నిర్మాణానికి రూ.215 కోట్లు కేటాయించినట్లు సీఎండీఏ తెలిపింది. రాజధాని నగరంలో వివిధ స్థాయిలో మౌలిక వసతులు మెరుగుపడినప్పటికీ, ఉత్తర చెన్నైలో తగినంత మెరుగుదల లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉత్తర చెన్నై అభివృద్ధికి రూ.1,000 కోట్లతో ప్రణాళికలు రూపొందించగా, తాజాగా ప్రాజెక్ట్ వ్యయం రూ.6,000 కోట్లకు పెంచారు. అందులో భాగంగా వాటర్ బేసిన్ రోడ్డు, స్టాన్లీ రోడ్డు తదితర ప్రాంతాల్లో కొత్త అపార్ట్‌మెంట్లు నిర్మించాలని సీఎండీఏ నిర్ణయించింది. అలాగే, ఉత్తర చెన్నై పరిధిలోని కొడుంగైయూర్, తూర్పు శ్మశాన వాటిక రోడ్డు, కోదండరామర్ వీధి తదితర ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన 1,336 గృహాలను రూ.215 కోట్లతో పునర్నించనున్నారు. ఈ పనులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టి వచ్చే ఆర్థిక సంవత్సరానికి ముగించనున్నట్లు అధికారులు తెలిపారు.

హాస్టల్ వార్డెన్లు, సిబ్బందికి అవార్డులు



అవార్డులు అందిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2023-24వ సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల పర్యవేక్షణలో శ్రద్ధ చూపిన వార్డెన్లు, సిబ్బందికి కలెక్టర్ సుబ్బలక్ష్మి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, సబ్ కలెక్టర్ (శిక్షణ) రవికుమార్, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెంథిల్‌కుమార్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మురుగన్, వేలూరు తహసీల్దార్ విష్ణుప్రియ, జిల్లా ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ అధికారి మధుచెలియన్, జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి సీత తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి అసెంబ్లీ నుంచి విపక్షాల వాకౌట్

పుదుచ్చేరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర అసెంబ్లీ నుంచి డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు వాకౌట్ చేశాయి. ఈ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాసనాథన్ ప్రసంగంతో ప్రారంభమైన విషయం తెల్సిందే. రెండో రోజైన మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభ్యులు తమ ప్రసంగాలను ప్రారంభించారు. అసెంబ్లీలో డీఎంకే విపక్ష నేత శివ మాట్లాడుతూ, ఫెంగల్ తుపాను కారణంగా రాష్ట్రంలో అపారనష్టం వాటిల్లిందని, కానీ ప్రభుత్వం బాధితులను ఆదుకోవడంలోనూ, ఆర్థిక సాయం అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ, కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించిన మేరకు నిధులు రాలేదన్నారు. దీనికి అధికార సభ్యులు అడ్డుతగలడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో డీఎంకే, కాంగ్రెస్ కూటమి శాసనసభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

విద్యార్థులతో కలిసి కలెక్టర్ ఫుట్‌బాల్



విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడి, వారితో మాట్లాడుతున్న కోవై కలెక్టర్

టి.నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు నెహ్రూ స్టేడియంలో ఆ జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ వారిని ఉత్సాహపరిచారు. ఆ స్టేడియంలో రూ.6.55 కోట్ల తో కొత్త ఫుట్‌బాల్ మైదానాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో స్టేడియం తనిఖీ చేయడానికి కలెక్టర్ వెళ్ళారు. ఆ సమయంలో ఫుట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులను కలుసుకున్నారు. స్టేడియంలో అన్ని వసతులున్నాయా అని వాకబు చేశారు. ఆ తర్వాత విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. జిమ్నాస్టిక్, వాకింగ్ ట్రాక్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఆ స్టేడియంలో ప్రభుత్వం కల్పించిన అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించి పేరుతెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.

నకిలీ పాస్‌పోర్ట్‌తో శ్రీలంకకు పరారీయత్నం

● అక్కాతమ్ముళ్ల అరెస్టు



అరెస్టయిన దుశాంతిని, అరుణ్‌కుమరన్

టి.నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ పాస్‌పోర్టుతో శ్రీలంకకు పారిపోయేందుకు ప్రయత్నించిన అక్కాతమ్ముళ్లను సెంట్రల్ క్రైం విభాగం పోలీసులు అరెస్టుచేశారు. మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో శ్రీలంకకు ఓ విమానం బయలుదేరటానికి గంట ముందు అనుమానాస్పదంగా సంచరిస్తున్న శ్రీలంకకు చెందిన దుశాంతి, ఆమె తమ్ముడు అరుణ్‌కుమరన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. వీరిరువురూ తిరుచ్చి సమయపురంలో ఉన్న శ్రీలంక శరణార్థుల శిబిరంలో నివసిస్తుండేవారని, నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులను తయారు చేసుకుని ఇద్దరూ తమ దేశానికి విమానంలో వెళ్లేందుకు ప్రయత్నించారని ఆ విచారణలో వెల్లడైంది. వెంటనే వారిని అరెస్టు చేశారు. సెంట్రల్ క్రైం విభాగం పోలీసులు కేసు నమోదు చేసుకుని, వారికి నకిలీ పాస్‌పోర్టులు తయారు చేసి ఇచ్చిన ఏజెంట్ల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

● కొడనాడు కేసు...

విచారణకు హాజరైన జయ మాజీ భద్రతాధికారి



వీరపెరుమాళ్

అడయార్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొడనాడు ఎస్టేట్ దోపిడీ, సెక్యూరిటీ గార్డు హత్య కేసు విచారణలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలిత మాజీ భద్రతాధికారి వీరపెరుమాళ్ మంగళవారం సీబీసీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. ఈ కేసు విచారిస్తున్న సీబీసీఐడీ.. ఆయనకు సమన్లు పంపిన నేపథ్యంలో కోవైలోని సీబీసీఐడీ కార్యాలయానికి వచ్చారు. 2017, ఏప్రిల్ 23వ తేదీన నీలగిరి జిల్లా కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన దోపిడీ, హత్య కేసులో మొత్తం పది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో 250 మందిని సీబీసీఐడి విచారించింది. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలితకు, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామికి భద్రతాధికారిగా వ్యవహరించిన వీరపెరుమాళ్‌కు సీబీసీఐడీ సమన్లు పంపి విచారణకు పిలిచింది. ఈ నేపథ్యంలో కోవైలోని గాంధీపురంలో ఉన్న సీబీసీఐడీ కార్యాలయానికి ఆయన మంగళవారం హాజరు కాగా, ఆయన సీబీసీఐడీ అధికారులు విచారణ జరిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు దావీదు కన్నుమూత



ఎండ్లూరి దావీదు (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక చూళైప్రాంతానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ఎండ్లూరి దావీదు (102) వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా మంగళవారం ఉదయం కన్నుమూశారు. 1824 సెప్టెంబరు 16న జన్మించిన ఆయన తెలుగు మీడియంలో చదువుకుంటూ దేశభక్తి అలవర్చుకున్నారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య సమరంలో భాగస్వామ్యం పంచుకున్నారు. ఆయన సైన్యంలో చేరి రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. 1846 జూన్ 13న మిలటరీ నుండి పదవీవిరమణ పొందారు. కొన్నేళ్ళ తర్వాత రైల్వేశాఖలో పనిచేశారు. చూళై తెలుగు బాప్టిస్టు సంఘం (సీటీబీసీ)లో సీనియర్ సభ్యుడైన ఎండ్లూరి దావీదు సంఘం తరుపున పలు ఆధ్యాత్మిక, సామాజికసేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఎండ్లూరి దావీదుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన భౌతిక కాయానికి నగరంలోని పలు తెలుగు బాప్టిస్టు సంఘాల పాస్టర్లు, నిర్వాహకులు, తెలుగు సంఘాల ప్రతినిధులు పుష్పాంజలి ఘటించారు. దావీదుకు అంత్యక్రియలు బుధవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు, సీటీబీసీ నిర్వాహకులు తెలిపారు.

సీసీ కెమెరాల నిఘాలో పళని ఆలయ ఏనుగు



పళని దండాయుధపాణి ఆలయ ఏనుగు 'కస్తూరి'

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి ఆలయ ఏనుగు 'కస్తూరి' కదలికలు, చేష్టలపై అటవీ శాఖ అధికారులు సీసీ కెమెరాలతో నిఘా వేస్తున్నారు. ఇటీవల కుండ్రక్కుడి ఆలయ ఏనుగు అగ్ని ప్రమాదంలో మృతి చెందటం, తిరుచెందూరు ఆలయ ఏనుగు 'దైవానై' మావటి, అతడి బంధువుపై దాడి చేయడం వంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో పళని ఆలయ అధికారులు కస్తూరి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. పళని ఆలయ ఏనుగు కస్తూరి ఆలయానికి వచ్చే భక్తులతో సఖ్యతగా ఉంటోంది. అదే సమయంలో ఆ ఏనుగును మావటీలు సక్రమంగా సంరక్షిస్తున్నారా? వేళకు దానికి ఆహారం పెడుతున్నారా? అనే విషయాన్ని ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలలో నమోదైన వీడియో ద్వారా పరిశీలిస్తున్నారు.

హెరాయిన్‌తో ప్రేమజంట అరెస్ట్

ప్యారీస్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలో హెరాయిన్ విక్రయిస్తున్న ఓ ప్రేమజంటను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్రిపుర రాష్ట్రానికి చెందిన షాహల్ హుస్సేన్ (23), 17ఏళ్ళ యువతిని ప్రేమించి రెండేళ్ళుగా పెరంబూరులో ఓ ప్రైవేటు సంస్థలో కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాల్టాక్స్ రోడ్డులోవున్న ఓ హోటల్‌లో గత వారంరోజులుగా బసచేసిన వీరు, దేశంలో నిషేధించిన మాదకద్రవ్యాలను చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం ఉదయం పోలీసులు ఆ హోటల్‌కు వెళ్ళి తనిఖీలు నిర్వహించారు. ప్రేమజంటను అదుపులోకి తీసుకుని వారి నుండి 130గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వందే భారత్ రైలుపై రాళ్ల దాడి

● ధ్వంసమైన అద్దాలు

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలుపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు రువ్వడంతో కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. తిరునల్వేలి నుంచి చెన్నైకి సోమవారం ఉదయం బయల్దేరిన వందే భారత్ రైలు, కడంబూర్ సమీపం తంగమ్మాళ్‌పురం రైల్వే గేట్ సమీపంలో వస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో సి1 బోగీ కిటికీ అద్దాలు ధ్వంసం కావడంత, ఆ బోగీలో ప్రయాణికులు భయభ్రాంతులయ్యారు. ఈ విషయమై లోకో పైలెట్ మదురై రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై తూత్తుకుడి రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి, రైలుపై రాళ్లు రువ్విన అగంతకుల కోసం గాలిస్తున్నారు.

కాంచీపురంలో రౌడీ హత్య

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలో ఓ రౌడీని గుర్తుతెలియని వ్యక్తులు బాంబుతో దాడిచేసి హతమార్చారు. కాంచీపురానికి చెందిన రాజాపై హత్య, హత్యాయత్నం, కిడ్నాప్ సహా 20కి పైగా కేసులున్నాయి. మంగళవారం ఉదయం కాంచీపురం తిరుక్కాలిమేడు ప్రాంతంలో రాజా ఉన్న సమయంలో అక్కడకు వచ్చిన ఐదుగురు వ్యక్తులు అతడిని చుట్టుముట్టారు. మొదట రాజాపై బాంబు వేసిన వ్యక్తులు, కొడవళ్లు, కత్తులతో అతడిపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనలో రాజా ఘటనా స్థలంలోనే మృతిచెందారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదుచేసి హంతకుల కోసం గాలిస్తున్నారు. కాగా, రౌడీ రాజా హత్యతో తిరుక్కాలిమేడు సహా పలు ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొనడంతో, పోలీసులకు భారీగా మోహరించారు.

కన్నియాకుమారి రైలులో గంజాయి స్వాధీనం



రైలు బోగీలో లభించిన గంజాయితో రైల్వే పోలీసులు

టి.నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో పూణే నుంచి వచ్చిన రైలులో 12 కేజీల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కన్నియాకుమారి రైల్వేస్టేషన్ చేరుకున్న ఆ రైలు నుండి ప్రయాణికులంతా దిగిన తర్వాత రైల్వే పోలీసులు బోగీలు తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ అన్‌రిజర్వుడు బోగీలో సీటు కింద ఉన్న ఓ పెద్ద సైజు ట్రాలీ బ్యాగ్ చూసి, దానిని తెరచి చూడగా అందులో ఒక్కొక్కటీ కేజీ బరువున్న 12 గంజాయి పొట్లాలు లభించాయి. వెంటనే రైల్వే పోలీసులు దానిని స్వాధీనం చేసుకుని, గంజాయిని తరలించిన దుండగుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

కబడ్డీలో విషాదం

● కూతకు వెళ్తూ క్రీడాకారుడి మృతి



కూతకు వెళ్లిన సమయంలో జరిగిన ఘటన (పక్క చిత్రంలో) జగన్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలో కబడ్డీ ఆడుతున్న 22 ఏళ్ల యువకుడు హఠాత్తుగా స్పృహ తప్పి మృతిచెందిన ఘటన విషాదం నింపింది. విరుదునగర్ జిల్లాకు చెందిన జగన్ ఆదివారం జరిగిన కబడ్డీ పోటీలో కూతకు వెళ్లగా ప్రత్యర్థులు అతడిని పట్టుకొని బయటకు తోసివేసిన సమయంలో హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయాడు. నిర్వాహకులు, సహచర క్రీడాకారులు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. జగన్ కింద పడిన సమయంలో తల వెనుక బలమైన గాయం తగలడంతో శ్వాస, గొంతు నరాలు తెగాయని, అందువల్ల అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, జగన్ అంత్యక్రియల్లో వేలాది మంది కబడ్డీ క్రీడాకారులు హాజరై నివాళులర్పించారు.

కొరట్టూరు రైల్వేస్టేషన్‌లో ఘర్షణ

● 9 మంది విద్యార్థుల అరెస్టు

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరు రైల్వేస్టేషన్‌లో సోమవారం సాయంత్రం రాజధాని కళాశాల, పచ్చయప్పా కళాశాల విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి తొమ్మిదిమందిని అరెస్టు చేశారు. బీచ్ నుండి అరక్కోణం వెళ్తున్న లోకల్ విద్యుత్ రైలు కొరట్టూరు రైల్వేస్టేషన్‌లో ఆగగానే ఆ రైలులో ప్రయాణించిన రాజధాని కళాశాల, పచ్చయప్పా కళాశాల విద్యార్థులు ప్లాట్‌ఫామ్‌పై దిగి పరస్పరం ఘర్షణపడ్డారు. రైలులో ప్రయాణిస్తున్న విద్యార్థులపై రాళ్ల వర్షం కురిపించారు. తర్వాత దాడికి పాల్పడిన విద్యార్థులందరూ మాయమయ్యారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని రైల్వే పోలీసులు అక్కడి సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన తొమ్మిది మంది విద్యార్థులను అరెస్టు చేశారు. 'రూట్ తల' విషయంగా ఈ ఘర్షణ జరిగినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

సిలిండర్ పేలిన ఘటనలో చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేళచ్చేరి సమీపం కోవిలంబాక్కం గాంధీ నగర్‌లో 15 వ వీధిలో మునుసామి, రాణి అనే భార్యాభర్తలు, శాంతి (45) అనే కుమార్తె, అల్లుడు రఘు (48), మనవడు హరిహరన్ (20) కలిసి ఉంటున్నారు. ఈ నెల ఐదో తేదీ వేకువజాము రాణి వంటగదిలోకి వెళ్ళి లైట్ స్విచ్ ఆన్ చేయగానే వంటగ్యాస్ నుండి మంటలు చెలరేగి సిలిండర్ పేలింది. ఈ మంటలలో చిక్కుకుని నలుగురూ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కేఎంసీ ఆస్పత్రిలో చేర్చారు. మంగళవారం మధ్యాహ్నం చికిత్స ఫలించక మునుసామి, శాంతి, హరిహరన్ మృతి చెందినట్లు పోలీసులు ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాడీఎంకే నేత మృతి

ప్యారీస్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురవాయల్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వెళ్ళిన అన్నాడీఎంకే నాయకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మధురవాయల్ లక్ష్మీనగర్ చింతామణి వీధికి చెందిన శర్వాణన్ (41) అన్నాడీఎంకే విద్యార్థి విభాగం నాయకుడిగా, బూత్ సభ్యుడిగా వ్యవహరించారు. ఆయన సోమవారం తన మిత్రుడి ద్విచక్రవాహనంలో వెనుక కూర్చుని అంబత్తూరు బయలుదేరారు. మధురవాయల్ ఫ్లైఓర్‌పై వెలుతున్న సమయంలో వేగంగా గుర్తుతెలియని వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఆగకుండా వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శరవణన్ అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై కోయంబేడు ట్రాఫిక్ విభాగం పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు.

మంచు కురిసే వేళలో...



పెరంబూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం కొడైకెనాల్‌లో తీవ్రమైన మంచు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించింది. కొండ శ్రేణుల్లో ప్రకృతి అందాలు సంచరించుకొని చల్లటి వాతావరణం కలిగిన కొడైకెనాల్‌కు దేశ, విదేశీ పర్యాటకులు వస్తుంటారు. వేసవి కాలంలో సేదతీరేందుకు కుటుంబ సభ్యులతో పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. రాష్ట్రంలో ఫిబ్రవరి మూడో వారం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. అయినా, కొడైకెనాల్‌లో చల్లటి వాతావరణం, ఉదయం మంచు కురుస్తోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం 13 జిల్లాల్లో వేసవి వర్షాలు కురిసాయి. ఈ ప్రభావంతో కొడైకెనాల్‌లో దట్టమైన మంచు, తేలికపాటి జల్లులు కురిశాయి. ఉదయం 9 గంటల ప్రాంతంలో కూడా వాహనాలు హెడ్ లైట్లు వేసుకొని వెళ్లాల్సిన వాతావరణం నెలకొంది.

మహిళా సమస్యల ఇతివృత్తంతో 'రాబర్'


'రాబర్' ఆడియో రిలీజ్ దృశ్యం

తమిళ చిత్రజ్యోతి

సమాజంలో మహిళా సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని రూపొందిన చిత్రం 'రాబర్'. సీనియర్ పాత్రికేయురాలు కవిత నిర్మించిన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ నగరంలో తాజాగా జరిగింది. ఇందులో చిత్రపరిశ్రమకు చెందిన సినీ ప్రముఖులు కె.భాగ్యరాజ్, ఎస్.త్యాగరాజన్, కలైపులి ఎస్.థాను, అంబిక, రంభ తదితరులు పాల్గొని ఆడియో రిలీజ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాత కవిత మాట్లాడుతూ, 'ఇది నా తొలి చిత్రం కాదు. గతంలో మూడు లఘు చిత్రాలను నిర్మించాను. ప్రశంసలు, విమర్శలు ఒక వ్యక్తిని మరో స్థాయికి తీసుకెళతాయి. అలా నన్ను ప్రతి దశలోనూ ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీడియా రంగం నాకు 22 యేళ్ళ అనుభవం, శ్రమను ఇచ్చింది. చిత్రపరిశ్రమలోని అనేక మంది ప్రోత్సాహం, ఆశీర్వాద ంతో ఈ స్థాయికి చేరుకున్నాను. నటుడు త్యాగరాజన్ ఇంటిలోనే పెరిగాను. నా జీవితంలో ఎలాంటి కార్యక్రమమైనా ఆయన లేకుండా చేయను. కెనడాలో ఉండే రంభ నాకు మంచి స్నేహితురాలు. నా కోసం ఈ కార్యక్రమానికి వచ్చిన ఆమెకు ధన్యవాదాలు. నటుడు, దర్శకుడు త్యాగరాజన్ మాట్లాడుతూ, 'నిర్మాతగా కవిత మున్ముందు మరిన్ని చిత్రాలు నిర్మించాలి. చిన్న నిర్మాతలకు సహాయం చేయాలన్న ఆమె ఆలోచన చాలా మంచింది. నిర్మాత థాను అనేక మంది చిన్న నిర్మాతలకు సాయం చేశారు. కవిత మున్ముందు మరిన్ని చిత్రాలు నిర్మించాలి' అని కోరారు. నిర్మాత ఎస్.థాను మాట్లాడుతూ, 'కవిత నాకు కూతురు వంటిది. తమిళ భాషపై ఆమెకు మంచి పట్టుంది. ప్రతి పదానికి కొత్త అర్థం గోచరిస్తుంది. అలాంటి వ్యక్తి సినిమా నిర్మించారు. ఒక పాత్రికేయురాలిగా ఆమె సేవలు ప్రశంసనీయం' అని కొనియాడారు. హీరో కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన శక్తి ఫిలిమ్స్ అధినేత శక్తివేలన్‌కు ధన్యవాదాలు. ఈ రోజుల్లో చిత్రాన్ని నిర్మించడం పెద్ద విషయం కాదు. దాన్ని విడుదల చేయడం పెను సవాల్‌గా మారంది. ఆ కోణంలో శక్తివేలన్ నిర్మాత కవితకు అండగా నిబడ్డారు. ఈ వేడుకకు ఇంతమంది వచ్చి మద్దతు తెలుపుతున్నారంటే కారణం కవిత మంచితనం' అన్నారు. కాగా, ఈ నెల 14న విడుదలకానున్న ఈ చిత్రానికి డెబ్యూ డైరెక్టర్ పాండి దర్శకత్వం వహించగా, మెట్రో సత్య, డేనియల్ అన్నిపోప్, దీపా శంకర్, జయప్రకాష్, సెడ్రాయన్‌లు ప్రధాన పాత్రలను పోషించారు. సంగీతం జోహాన్ సెవనీష్. ఇంప్రెస్ ఫిలిమ్స్, మెట్రో ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్.కవిత, ఆనంద్ కృష్ణన్ కలిసి నిర్మించారు.

'రెట్రో' కోసం పూజా డబ్బింగ్



హీరో సూర్య తాజా చిత్రం 'రెట్రో' కోసం హీరోయిన్ పూజా హెగ్డే పెద్ద సాహసం చేశారు. ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న ఆమె తన పాత్రకు స్వయంగా డబ్బింగ్ చెప్పి చిత్ర బృందాన్ని ఆశ్చర్యానికి గురిచేశారు. ఈ విషయంపై నిర్మాణ సంస్థ 'కామిక్స్' రూపంలో కొన్ని పోస్టర్లను రిలీజ్ చేసింది. ఈ సినిమాలో నటించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నప్పటి నుంచి పూజా హెగ్డే తమిళంలోనే మాట్లాడుతూ, పట్టుసాధించి, మూవీ చిత్రీకరణ పూర్తయ్యే సమయానికి తన పాత్రకు డబ్బింగ్ చెప్పే స్థాయికి చేరుకున్నారు. పైగా తమిళంలో డబ్బింగ్ చెప్పిన తొలి చిత్రమేకాకుండా తమిళంలో తనకు మంచి పేరు తెచ్చే మూవీగా కూడా ఉంటుందని పూజా హెగ్డే గట్టిగా విశ్వసిస్తున్నారు. కాగా, మే 1 తేదీన విడుదలయ్యే ఈ చిత్రానికి కార్తీక్ సుబ్బురాజ్ దర్శకత్వం వహించగా, సూర్య, జ్యోతిక నిర్మాతలుగా వ్యవహరించారు.

పేద విద్యార్థులకు 'మనిదమ్' నిర్మాత చేయూత


శ్రీకాంత్ దేవాతో 'మనిదమ్' నిర్మాత

యువర్ పేకర్స్ ప్రొడక్షన్స్ పతాకంపై కృష్ణరాజ్ నిర్మించిన చిత్రం 'మనిదమ్'. ఈ నెల 7వ తేదీ ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. మానవ విలువలను ప్రతిబింబిస్తూ ఈ సినిమాను తెరకెక్కించారు. ఇందులో నటించిన నటీనటులంతా కొత్తవారే కావడం గమనార్హం. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకాంత్ దేవా సంగీతం అందించారు. ఈ సినిమా విడుదలైన అన్ని సెంటర్లలో మంచి టాక్‌తో ప్రదర్శితమవుతోంది. పైగా ఈ సినిమా సాధించే కలెక్షన్స్‌తో 70 శాతం మొత్తాన్ని దారిద్ర్యరేఖకు దిగువన ఉండే పేద పిల్లల విద్య కోసం ఖర్చు చేయనున్నట్టు నిర్మాత కృష్ణరాజ్ ప్రకటించారు. సమాజంలో అనేక మంది పేద పిల్లలు విద్యకు దూరమవుతున్నారని, ఇలాంటి వారిని ఆదుకునేందుకు వీలుగా తన వంతు సాయంగా ఈ చిరు సాయం చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

నీటి సమస్యతో 'వరుణన్'

● దర్శకుడు జయవేల్


హీరోయిన్లతో హీరో దుష్యంత్

ప్రతి ఒక్కరూ నీటి సమస్యను ఎదుర్కొంటారని, చెన్నై మహానగరంలోని ఉత్తర చెన్నైలో ఈ సమస్య అధికంగా ఉంటుందని, అందుకే 'వరుణన్ - ది గాడ్ ఆఫ్ వాటర్' మూవీ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుందని దర్శకుడు జయవేల్ మురుగన్ అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన ఈ మూవీని యాక్సైట్ ఫిలిమ్స్ బ్యానరుపై కార్తీక్ శ్రీధరన్ నిర్మాణంలో వాన్ ప్రొడక్షన్స్ సహకారంతో తెరకెక్కింది. దుష్యంత్ జయప్రకాష్ హీరోగా నటించగా, గేబ్రియెల్లా హరిప్రియ హీరోయిన్లుగా నటించారు. రాధారవి, చరణ్ రాజ్, శంకర్ నాగర్ విజయన్, మహేశ్వరి, జీవా రవి, అర్జున కీర్తి వాసన్, ఫైటు కార్తీక్, ప్రియదర్శన్ తదితరులు నటించారు. ఈ సినిమా ఆడియో రిలీజ్ వేడుక నగరంలో జరిగింది. ప్రముఖ నిర్మాత అన్బుచెళియన్ పాల్గొని ఆడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'వాటర్ క్యాన్ ఉపయోగించి దర్శకుడు జయవేల్ ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా చూశాక విడుదల కోసం సాయం చేయాలని దర్శకుడు కోరారు. సినిమా చూశాను. చాలా బాగుంది. వచ్చే శుక్రవారం విడుదల చేస్తున్నాం. ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒక్కరి కృషి వృధాపోదు. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ విపరీతంగా పెరిగిపోవడంతో సినిమా వ్యాపారం దెబ్బతింది. ఈ సినిమాకు మీడియాతో ప్రతి ఒక్కరూ సపోర్టు చేయాలని కోరారు. దర్శకుడు జయవేల్ మురుగన్ మాట్లాడుతూ, 'ఇది కంటెంట్ మూవీ, నీటి సమస్య వివరించే చిత్రం. వాటర్ క్యాన్లు సరఫరా చేసే ఇద్దరు వ్యాపారుల మధ్య జరిగే ఆధిపత్య పోరు, సంఘర్షణే ఈ చిత్ర కథ. ఈ సినిమాకు వాయిస్ ఓవర్ ఇచ్చిన సీనియర్ నటుడు సత్యరాజ్‌కు ధన్యవాదాలు' అన్నారు.


ఊటీ గ్రంథాలయంలో బెంగళూరు విద్యార్థులు

గిరిజనుల జీవనవిధానంపై బెంగళూరు విద్యార్థుల అధ్యయనం

టి.నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో గిరిజనుల జీవన పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు బెంగళూరుకు చెందిన విద్యార్థుల బృందం ఊటీలో రెండు రోజులుగా పర్యటించింది. ఊటీ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి సమీపంలో ఉన్న జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించింది, బెంగళూరులోని నేషనల్ ఫ్యాషన్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ సెంటర్‌లో చదువుతున్న 30 విద్యార్థులు ఆ గ్రంథాలయంలో భారతదేశంలోని గిరిజనుల జీవనపరిస్థితులకు సంబంధించిన అరుదైన గ్రంథాలను పరిశీలించి వాటిలోని వివరాలను రికార్డు చేసుకున్నారు. ఈ విద్యార్థుల బృందానికి జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి రవి, ఇతర అధికారులు స్వాగతం పలికి గ్రంథాలయంలోని వివిధ విభాగాలకు తీసుకెళ్ళారు. సుమారు రెండు గంటలకు పైగా విద్యార్థులు తమ అధ్యయనానికి కావలసిన సరంజామాను సేకరించుకుని స్వస్థలానికి పయనమయ్యారు.

సేపియన్స్ హెల్త్ ఫౌండేషన్‌లో వరల్డ్ కిడ్నీ డే


పుస్తకావిష్కరణలో ప్రముఖులు

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మూత్రాశయ చికిత్సలో ఖ్యాతి గడించిన సేపియన్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వరల్డ్ కిడ్నీ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు కెంప్లాస్ట్ సన్మార్ ఎండీ రామ్‌కుమార్ శంకర్ అధ్యక్షత వహించారు. ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ.. కిడ్నీ వ్యాధులను నయం చేయడంలో కృత్రిమ మేథోపరిజ్ఞానం (ఏఐ) కూడా దోహదపడుతోందన్నారు. నటుడు సిద్ధార్థ్ పాల్గొని లవణ తగ్గింపు మార్గదర్శక పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ రాజన్ రవి చంద్రన్, సంస్థ ట్రస్టీ సుందర్ రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎం జైన్ కళాశాల ఆధ్వర్యంలో పద్మశ్రీ వేలు ఆసన్‌కు ఘన సత్కారం


పరై ఇసై వాద్య కళాకారుడు పద్మశ్రీ వేలు ఆసన్‌ను సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎం జైన్ కళాశాలలో పరై ఇసై (దళిత డప్పువాయిద్యం) వాద్య కళాకారుడు 'పద్మశ్రీ' వేలు ఆసన్‌ను ఆ కళాశాల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కళాశాల కార్యదర్శి ఉదాన్‌కుమార్ చోర్డియా, సహాయ కార్యదర్శి హేమంత్ చోర్డియా, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మహావీర్, డీన్ డాక్టర్ ఎంఎం రమ్యా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద కృష్ణన్, డిప్యూటీ డీన్ ఆర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వేలు ఆసన్ పరై ఇసై విశిష్టతలను విద్యార్థులకు వివరించారు.

రామచంద్ర డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు అంతర్జాతీయ పురస్కారం


డాక్టర్ హెచ్.తమిళ్‌చెల్వన్

వాషర్‌మెన్‌పేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రామచంద్ర డెంటల్ కాలేజీ ఆస్పత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.తమిళ్‌చెల్వన్‌ను అంతర్జాతీయ పురస్కారం వరించింది. అత్యుత్తమ క్లినికల్ నైపుణ్యాలు, వినూత్న సహకారాలు, ప్రపంచ వ్యాప్తంగా దంత సంరక్షణ అభివృద్ధిలో నిబద్ధతను ప్రదర్శించిన వ్యక్తులను ప్రతి ఏడాది 'ద ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ డెంటిస్ట్స్' సంస్థ 'ఎక్సలెన్స్ ఇన్ డెంటిస్ట్రీ అవార్డ్' పేరుతో సత్కరిస్తుంది. ఈ ఏడాదికి గాను ఈ అవార్డుకు ప్రొఫెసర్ తమిళ్‌చెల్వన్ ఎంపికైనట్లు ఆస్పత్రి వర్గాలు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి.

ఘనంగా కొళత్తూరు తిరుమలేశ్వరాలయ కుంభాభిషేకం


కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుత్తణి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని కొళత్తూరు గ్రామ తిరుమలీశ్వరాలయ మహాకుంభాభిషేకం మంగళవారం ఉదయం ఘనంగా జరిగింది. 15వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయల కాలంలో త్రిపురసుందరి సమేత తిరుమలేశ్వరాలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. అంతటి ఘన జరిత్ర కలిగిన ఈ ఆలయం కాలక్రమేణా శిథిలావవస్థకు చేరుకుంది. పదేళ్ల క్రితం తిరుత్తణికి చెందిన సాషన్-యగ్నబి రియా దంపతులు ఆలయ పునర్నిర్మాణానికి ముందుకొచ్చారు. శిథిలావస్థలోవున్న ఆలయ రాజగోపురం, విమాన గోపురం, అమ్మవారి ఆలయం, రాతిమండపాలు, ప్రాకారాలు, శాలాహారాలు తదితర నిర్మాణపనులు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణంలో యాగశాలలు ఏర్పాటుచేసి, 20మంది శివాచార్యులు హోమాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో మంగళవారం తెల్లవారుజామున 4గంటలకు మహాపూర్ణాహుతి, యాగశాలపూజ జరిగింది. ఉదయం 10గంటలకు రాజగోపురంపై పండితుల వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ మహాకుంభాభిషేకాన్ని శాస్త్రోక్తంగా చేశారు. మధ్యాహ్నం 12గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ యాజమాన్యం ప్రారంభించారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విరుదాచలంలో నేత్రపర్వంగా పంచమూర్తుల రథోత్సవం

ప్యారీస్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా విరుదాచలంలో ప్రసిద్ధిచెందిన వృద్ధగిరీశ్వరాలయంలో మాసి మాసం బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం పంచమూర్తులు వేర్వేరు రథాల్లో మాడవీధుల్లో ఊరేగారు. ప్రతిఏటా ఈ ఆలయం ఆధ్వర్యంలో మాసి మఖం బ్రహ్మోత్సవాలు నెల రోజుల పాటు ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించడం ఆనవాయితీ, ఆ రీతిలో ఈ ఏడాది ఉత్సవాలు గత నెల 11వ తేదీ చెల్లియమ్మన్ వారికి కంకణధారణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. 21వ తేదీ ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. అప్పటి నుండి ఉదయం, సాయంత్రం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ, వాహనసేవలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధానంశమైన రథోత్సవం మంగళవారం ఉదయం అశేషభక్తజనం మధ్య కోలాహలంగా సాగింది. అలంకరించిన పంచమూర్తులను వేర్వేరు రథాల్లో ఆశీనులను చేసి, ఆలయ చతుర్మాడవీధుల్లో ఊరేంగించారు. బుధవారం 'మహా మఖం' పర్వదినం సందర్భంగా, తీర్థవారి, గురువారం తెప్పోత్సవం, ఈ నెల 14న చండికేశ్వర ఉత్సవాలకు ఆలయ యాజమాన్యం ఏర్పాట్లు సిద్ధంచేసింది. కాగా, 15న ప్రారంభంకానున్న విడయాత్రి ఉత్సవం 24వ తేదీతో ముగియనుంది. కాగా, అదేరోజు సాయంత్రం మహామఖం బ్రహ్మోత్సవాలు ముగింపుకొస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా వల్లిమలై మురుగన్ రథోత్సవం


రథోత్సవానికి హాజరైన మంత్రి దురై మురుగన్

వేలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వల్లిమలై సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన సుబ్రమణ్యస్వామి రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కాట్పాడి సమీపంలోని ఈ ఆలయ మాసి నెల బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల క్రితం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు ఉత్సవమూర్తులు వేర్వేరు వాహనాల్లో ఊరేగుతున్నారు. వేడుకల్లో భాగంగా ఏడవ రోజైన మంగళవారం ఉదయం వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి అభిషేకం చేసి, (మూలస్థానంలో) చందన కాపు అలంకారం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులు రథంపై ఆశీనులను చేశారు. రథోత్సవాన్ని మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. రథం కొండను చుట్టి తిరిగి ఆలయానికి వచ్చేందుకు 3 రోజులు పడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వామి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

చెన్నైలో గోసంరక్షణ కేంద్రాలు

● మంత్రి పీకే శేఖర్‌బాబు


గోశాలకు భూమిపూజ నిర్వహిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో గోసంరక్షణ కేంద్రాల ఏర్పాటు చేసేందుకు చేపట్టినట్టు దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. విల్లివాక్కంలో చెన్నై తూర్పు జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ 72వ జన్మదినం సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి శేఖర్‌బాబు ప్రారంభించారు. అనంతరం విల్లివాక్కం నియోజకవర్గం పరిధిలోవున్న పాడి పై ఓవర్ కింద హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న స్థలంలో రూ.1.48 కోట్లతో నిర్మించనున్న గోశాలకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, నగరంలో రోడ్లపై సంచరిస్తున్న పశువులను సంరక్షించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి స్టాలిన్ సూచనల మేరకు గోసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గోసంరక్షణకు అవసరమైన భూములను ఎంపిక చేసేపనులు దేవాదాయ శాఖ అధికారులకు అప్పగించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ప్రియ, జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్, ఎమ్మెల్యే వెట్రి అలగన్, సీఎండీఏ, జీసీసీ అధికారులు పాల్గొన్నారు.

వినతులను సత్వరం పరిష్కరించండి

● పోలీసు కమిషనర్ అరుణ్ ఆదేశం


పోలీసుల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పోలీస్ గ్రీవెన్స్‌లో వచ్చిన వినతిపత్రాలను పరిశీలించి త్వరగా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ అరుణ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. వేప్పేరిలోని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్‌లో మంగళవారం ఉదయం కమిషనర్ అరుణ్ నిర్వహించిన సమస్యల పరిష్కార శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. నగరంలోని పలు పోలీసు విభాగాలు, పోలీసుస్టేషన్లలో పనిచేస్తున్న అధికారులు, కానిస్టేబుళ్లు పెద్ద శిబిరానికి హాజరై తమ సమస్యలపై కమిషనర్ అరుణ్‌కు వినతి పత్రాలు సమర్పించారు. నలుగురు ఎస్ఐలు,ఎనిమిది మంది ఏఎస్ఐలు సహా మొత్తం 90 మంది నుండి ఆయన విజ్ఞప్తుల స్వీకరించారు. బదిలీలు, వేతనం పెంపు, నివాసగృహం తదితరాల కోసం వచ్చిన వినతిపత్రాలను ఆయనపరిశీలించారు.

ఘనంగా మురుగన్ తిరుకల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుత్తణి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన తిరుత్తణి మురుగన్ ఆలయంలో మాసి మాస బ్రహ్మోత్సవాలు మార్చి 3న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తొమ్మిదో రోజున స్వామివారు అశ్వవాహనంపై దేవేరులతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి తిరుకల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుక కోసం రాష్ట్రం నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు నీరు, ఆహారం, వైద్యం వంటి సదుపాయాలు సమకూర్చారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కంచిలో వెరైటీ నిశ్చితార్థం

● సైకిల్‌పై వచ్చిన వధూవరులు


వధువును సైకిలు పై కూర్చోబెట్టి తీసుకెళ్తున్న వరుడు

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నగరం కాంచీపురంలో ఓ పెళ్లి నిశ్చితార్థం వైవిధ్యంగా జరిగింది. ఆ సందర్భంగా వధువును సైకిలుపై కూర్చోబెట్టుకుని వరుడు నడుపుకుంటూ రావడం అందరికీ విస్మయం కలిగించింది. కాంచీపురానికి చెందిన మనోజ్‌కు అదే ప్రాంతానికి చెందిన యోగలక్ష్మి అనే యువతితో నిశ్చితార్థం సోమవారం సాయంత్రం ఓరిక్కై ప్రాంతంలోని కల్యాణమండపంలో జరిగింది. ఆ సందర్భంగా సుమారు రెండు కిలోమీటర్లదూరంలో ఉన్న ఓ ఆలయం నుండి వధూవరులు సైకిలుపై కల్యాణ మండపానికి ఊరేగింపుగా వచ్చారు. వధువును సైకిలు ముందు కూర్చోబెట్టుకుని వరుడు సైకిల్ తొక్కుతూ వచ్చారు. ఆ తర్వాత కల్యాణమండపం వద్ద వధువు నలుగురు సోదరులు ఆమెను తమ చేతుల మీదుగా పల్లకీలో మోసుకెళ్లి మండప వేదికపై కూర్చొబెట్టారు. ఈ నిశ్చితార్థ వేడుకలకు వచ్చినవారికి పెళ్ళిపెద్దలు చక్కటి విందు ఏర్పాటు చేశారు. ఇలా ఆద్యంతమూ పెళ్ళినిశ్చితార్థం వింతలు విశేషాలతో కొనసాగింది.


మంగళవారం చెంగల్పట్టులో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళుతూ మార్గమధ్యంలో తనకు స్వాగతం పలికేందుకు నిలిచిన మహిళలతో సెల్ఫీ దిగుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

భక్తుల హడావుడిలో పాప మిస్

● పోలీసుల అప్రమత్తతతో క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు
● తిరుమలలో సంఘటన


దివ్యను రవికి అప్పగిస్తున్న పోలీసులు

తిరుమల నుంచి తిరిగి వెళ్లే హడావుడిలో ఐదేళ్ల చిన్నారిని ఒక కుటుంబం వదిలేసి వెళ్లిపోయింది. పోలీసుల అప్రమత్తతో ఆ పాప క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేరింది. మంగళవారం ఈ సంఘటన జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని హన్వాడకు చెందిన రవి, వెంకటేశ్వరి దంపతులు పదిమంది కుటుంబ సభ్యులతో సోమవారం తిరుమలకు వచ్చారు. దర్శనం చేసుకుని మంగళవారం ఉదయం తిరుపతికి బయలుదేరారు. ఈ హడావుడిలో తమ చిన్నారి దివ్య తమతో లేదనే విషయం గుర్తించకుండానే తిరుపతికి చేరుకున్నారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండులో పాప లేదని గుర్తించి ఆందోళనపడ్డారు. వెంటనే అక్కడ ఉన్న పోలీసు ఔట్‌పోస్టులో ఫిర్యాదు చేశారు. వారు వెంటనే తిరుమలకు సమాచారం ఇచ్చారు. తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం 3 వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా చిన్నారి కనిపించింది. సమాచారం తెలిసి తిరుమలకు వెళ్లిన దివ్య తండ్రి రవికి పాపను అప్పగించారు. సీఐ శ్రీరాముడు, సిబ్బందికి భక్తుడు ధన్యవాదాలు తెలిపారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

త్వరలో నా రెండో సినిమా

● 'బలగం' వేణు




'బలగం' చిత్రంతో మంచి హిట్ కొట్టిన నటుడు, దర్శకుడు వేణు మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో తన రెండవ సినిమా దిల్‌రాజ్ బ్యానర్‌లో ప్రారంభం కానుందని చెప్పారు. ఈక్రమంలో స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానని తెలిపారు. కాగా, అంతకుముందు తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి


వకుళాభరణం కృష్ణమోహన్ రావు

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.



ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.27 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,746

తలనీలాలు సమర్పించినవారు: 23,649

నెరవేరిన పేదింటి క్రీడాకారుడి కల

క్రీడల్లో రాణించి.. ఉద్యోగం సాధించి..




డీఆర్ఎం చేతులు మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకుంటున్న కార్తీక్

బాల్‌బాడ్మింటన్‌లో విశేష ప్రతిభతో ఓ యువకుడు తన కలను సాకారం చేసుకున్నాడు. రైల్వేలో ఉద్యోగం సాధించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచాడు. ఉద్యోగంలో చేరినా క్రీడాపరంపర కొనసాగిస్తున్నాడు. తిరుపతి రూరల్ మండలం కూపుచంద్రపేటకు చెందిన పొన్న కార్తీక్ రెక్కాడితే డొక్కాడని కుటుంబంలో పుట్టాడు. తండ్రి లోకనాథం రేణిగుంటలో టింబర్‌డిపోలో పనిచేస్తాడు. తల్లి లత గృహిణి. గ్రామానికి సమీపంలోనే దుర్గసముంద్రం హైస్కూల్లో కార్తీక్ చదువుకున్నాడు. అక్కడి మైదానంలోనే రోజూ స్నేహితులతో ఆడేవాడు. ముఖ్యంగా బాల్‌బాడ్మింటన్ మక్కువ చూపేవాడు. తొలినాళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగం పొంది తల్లిదండ్రుల కష్టాలను తీర్చాలనేది కార్తీక్ బలమైన సంకల్పం. క్రీడల్లో బాగా రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగం వస్తుందని తెలుసుకున్నాడు. పట్టుదలతో కష్టపడ్డాడు. పీలేరులో జిల్లా సెలక్షన్స్‌లో ఎంపికై క్రీడా ప్రస్థానానికి శ్రీకారం చుట్టాడు. తరువాత వెనుతిరిగి చూడలేదు. విజయ పరంపర కొనసాగించాడు. రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు పతకాలను కైవసం చేసుకున్నాడు. 2018లో స్పోర్ట్స్ కోటా ఆధారంగా రైల్వేలో ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం విశాఖపట్నంలోని సీనియర్ కమర్షియల్ కమ్ టికెట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు స్పోర్ట్స్ కోటాకింద రైల్వేలో ఉద్యోగం పొందిన ముగ్గురిలో కార్తీక్ కూడా ఒకడు. - తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి


గతేడాది రైల్వే టోర్నీలో విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న కార్తీక్

ఇప్పటికీ ఆడుతున్నాను

ఉద్యోగం వచ్చినా తనకు ఉపాధి చూపిన క్రీడను మర్చిపోలేదు. ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొంటున్నాను. అమ్మానాన్నల శ్రమ, అన్న రంజిత్, పీఈటీ టీచర్, బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధుల ప్రోత్సాహం నాకు తోడైంది. యువకులు కష్టపడి ఆడితే ఉద్యోగంతో పాటు క్రీడాకారుడిగా గుర్తింపు కూడా వస్తుందని గుర్తించాలి. - పొన్న కార్తీక్

భార్యపై భర్త హత్యాయత్నం

● నిందితుడి అరెస్ట్

పెళ్లకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతుల మధ్య అనుమానం పెనుభూతమై మనస్పర్థలు రేపింది. చివరకు భార్యపై భర్త హత్యయత్నానికి పాల్పడిన ఘటన పెళ్లకూరు మండలంలో జరిగింది. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలోని గుంటకింద పల్లె గ్రామానికి చెందిన హేమకుమార్, అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన పంతగాని లక్ష్మీప్రియ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. వివాహమైన కొద్ది నెలల నుంచే హేమకుమార్ భార్యపై అనుమానంతో తరచూ గొడవ పడేవాడు. ఇలా ఉండగానే వీరికి ఓ బిడ్డ జన్మించింది. తరువాత కూడా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోయేసరికి లక్ష్మీప్రియ తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. కొన్నాళ్ల తరువాత మళ్లీ కలుసుకున్న వీరు శ్రీకాళహస్తిలో కాపురం పెట్టారు. ఆదివారం మధ్యాహ్నం లక్ష్మీప్రియను బైక్‌పై ఎక్కించుకున్న హేమకుమార్ పెళ్లకూరు మండలంలో టెంకాయతోపు సమీపంలోని పంటకాలువ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న కత్తి, స్క్రూడ్రైవర్‌తో లక్ష్మీప్రియపై హేమకుమార్ దాడి చేశాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న యువకులు గమనించి హేమకుమార్‌ను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. తొట్టంబేడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని లక్ష్మీప్రియను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పారిపోయేందుకు ప్రయత్నించిన హేమకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన ప్రదేశం పెళ్లకూరు మండల పరిధిలోకి రావడంతో కేసును మంగళవారం ఆ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితుడిపై కేసు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.


నిందితుడు హేమకుమార్


గాయపడిన లక్ష్మీప్రియ

స్విమ్స్‌లో 12 ఏళ్ల బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ

తిరుపతి(వైద్యం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఊపిరి తిత్తుల సమస్యతో స్విమ్స్‌కు వచ్చిన 12 ఏళ్ల బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ చేసి ప్రాణాలు నిలబెట్టామని మెడికల్ సూపరింటెండెంట్ రామ్ మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా మాచర్ల నగరానికి చెందిన సైదాబీ(12) అనే బాలిక ఊపిరి తిత్తుల సమస్యతో బాధపడుతుంటే కుటుంబ సభ్యులు స్విమ్స్‌కు తీసుకువచ్చారు. ఇక్కడ వైద్యులు పరీక్షించగా బాలిక ఊపిరి తిత్తులు, గుండెకు మధ్యలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సీటీ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో గత నెల 25న బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ చేసి ఆ గడ్డను తొలగించారు. ప్రస్తుతం బాలిక పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. సాధారణంగా ఆ సర్జరీకి దాదాపు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని, స్విమ్స్‌లోని టీటీడీ ప్రాణదాన పథకంలో పూర్తి ఉచితంగా బాలికకు శస్త్ర చికిత్స అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య విభాగాధిపతులు అలోక్ సమంత్రే, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


చికిత్స అనంతరం కోలుకున్న బాలికతో వైద్యులు



కారు దహనం.. ప్రయాణికులు సురక్షితం

పాకాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదిపుట్ల బైలు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున కారులో మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. తిరుపతి వైపు నుంచి కొమ్మిరెడ్డిగారిపల్లె మీదుగా మదనపల్లెకు వెళ్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. కారులోని వారు దిగి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. పాకాల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలు ఆర్పారు. అగ్నిమాపక సిబ్బంది మనోహర్‌రెడ్డి, సురేంద్రబాబు, బాలాజీ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

18వరకు ఈకేవైసీ నమోదు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో రబీ సీజనుకు సంబంధించి ఈ-పంట నమోదు కోసం ఈకేవైసీని రైతులు ఈ నెల 18వ తేదీలోపు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రబీ 2024-25కు గాను 2,03,860 ఎకరాలకు సంబంధించి 72,966మంది రైతులు ఈ-పంట యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా 1,94,805 ఎకరాలకు గాను 69,228మంది రైతులు ఈకేవైసీ చేసుకున్నారని వివరించారు. ఇంకా చేసుకోని రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీలోపు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో 14వ తేదీ వరకు ప్రదర్శించి గ్రామసభల ద్వారా రైతుల వివరాలను చదివి వినిపిస్తారని తెలియజేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 19వ తేదీలోపు రాతపూర్వకంగా తెలియజేస్తే సరిచేసి 22వ తేదీ తుది జాబితాను తయారుచేస్తారని వివరించారు.

ఎర్రచందనం స్వాధీనం: ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్

తిరుపతి, మంగళం, మార్చి 11: భాకరాపేట అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.40 లక్షల విలువచేసే 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి ఓలగేజ్ వాహనాన్ని, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు కథనం మేరకు.. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన బృందంలోని ఆర్ఎస్ఐ కేఎస్ కే.లింగాధర్ స్థానిక ఎఫ్‌బీవో రాజేశ్‌కుమార్‌తో కలసి మంగళవారం తెల్లవారుజామున దేవరకొండ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. తుమ్మచేనుపల్లి మట్టి రోడ్డు వద్ద మోటార్ సైకిల్‌పై ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడి వాహనాన్ని వెంబడించగా ఒక లగేజి వాహనం కనిపించింది. ఆ వాహనాన్ని చుట్టుముట్టగా అందులోని స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి ఇద్దరు స్మగ్లర్లను పట్టుకో గలిగారు. లగేజి వాహనంలో ఉన్న 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. ఎర్రచందనం దుంగలతో సహా వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


పట్టుబడ్డ ఎర్రచందనంతో సహా స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

హోటల్ గదిలో కూలిన పీవోపీ

● అర్ధరాత్రి పరుగులు తీసిన భక్తులు




మినర్వా గ్రాండ్ హోటల్‌లో పెచ్చులూడిన వైనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో సోమవారం అర్ధరాత్రి తర్వాత స్లాబుకున్న పీవోపీ ఊడి పడింది. దీంతో గదిలో ఉన్న భక్తులు భయాందోళనతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న ఐదుగురు భక్తులు మినర్వా గ్రాండ్ హోటల్‌లోని ఓ గదిని తీసుకున్నారు. వీరంతా గాఢనిద్రలో ఉండగా రూములోని పైకప్పునకు ఉన్న పీవోపీ ఊడి కింద పడింది. దీంతో పెద్ద శబ్దం రావడంతో భయంతో పరుగులు తీశారు. వెంటనే సీఐ రామకృష్ణ, ఎస్ఐలు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందు జాగ్రత్తగా అన్ని గదుల్లోని వారిని బయటకు పంపి వివిధ హోటళ్లలో అకామడేషన్ ఏర్పాటు చేశారు. హోటల్‌కు తాళం వేసి అన్ని శాఖల నుంచి అనుమతులు తీసుకుని.. హోటల్‌ను తెరిచేలా పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. అన్ని హోటళ్లలో భద్రతా ప్రమాణాలపై తనిఖీలు చేయడానికి మున్సిపల్, పోలీసు, అగ్నిమాపక అధికారులు సిద్ధమయ్యారు.

హోటల్ యాజమాన్యంపై కేసు

'హోటల్ గదిలో పీవోపీ పెచ్చులూడిన ఘటనలో మా అక్క చిన్ని చిల్లకుర్తి (66), తల్లి ప్రేమలత రామయ్య (85)కు గాయాలయ్యాయి. అమెరికాలోని చికాగోలో ఉంటున్న వీరు శ్రీవారి దర్శనానికి వచ్చారు. గాయపడిన ఇద్దరూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు' అంటూ అమెరికాలో నివాసం ఉంటున్న రాణి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హోటల్ యాజమాన్యంపై ఈస్ట్ సీఐ కేసు నమోదు చేశారు.

యూనిఫాం ఎంతో బాగుంది


విద్యార్థుల యూనిఫాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం కొత్తగా రూపొందించిన యూనిఫాం ఎంతో బాగుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ కొత్త యూనిఫాం అమల్లోకి రానుందన్నారు. అమరావతిలోని విద్యాశాఖ మంత్రి లోకేశ్ కార్యాలయంలో ఈ యూనిఫాంను బొజ్జల మంగళవారం పరిశీలించారు.ఎలాంటి రాజకీయ గుర్తులు లేకుండా యూనిఫాం ఉండటం కూటమి పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు.

సెలవుపై జాయింట్ కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 16వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఆయన స్వగ్రామమైన ఉత్తరాఖాండ్ నైనిటాల్‌కు వెళ్లారు. తిరిగి 17నుంచి విధులకు హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు.

పీ4 సర్వేపై గ్రామసభలు నిర్వహించండి

● కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పీ4 సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి వివిధ అంశాలపై డీఆర్వో నరసింహులతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సున్నా పేదరికం లక్ష్యంగా నిర్వహిస్తున్న పీ4సర్వేలో భాగంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వెనుకబడిన ప్రాంతాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను శనివారంలోపు పూర్తిగా నిలిపివేయాలని, ఎవరూ వినియోగించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే, వర్క్‌ఫ్రం హోమ్ సర్వేను 15వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో సుశీలాదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోష్మాండ్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక

● అందుబాటులో 1,37,686 టన్నులు ● అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శకంగా ఇసుక ఉచితంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో మూడు డిసిల్టేషన్ పాయింట్ల నుంచి సుమారు 1,37,686 టన్నుల ఇసుక ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిరుపతి ప్రజలకు మూడు స్టాక్ పాయింట్లను ఉచిత విధానంలో ఇసుక సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.ఈ స్టాక్ పాయింట్లకు అన్నమయ్య జిల్లాలోని రీచ్‌ల నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు వివరించారు. జిల్లాలో గుర్తించిన మూడు డిసిల్టేషన్ పాయింట్లలో రెండు పెళ్లకూరు మండలం, మరొకటి కోట మండలం గూడలిలో ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు ఇసుక సరఫరాను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ పాయింట్ల వద్ద ఇసుక తవ్వడానికి, రవాణాకు ఏజెన్సీని నియమించామని, వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ లేదా నేరుగా వెళ్లి ఇసుక కమిటీ నిర్ధారించిన నామమాత్రపు రుసుం చెల్లించి తీసుకెళ్లవచ్చన్నారు. ఇసుక డిసిల్టేషన్ పాయింట్లను సంబంధిత ఆర్డీవోలు తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు మాట్లాడుతూ.. అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6వరకు ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా గనులశాఖ అధికారి బాలాజీ నాయక్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

హైవేలో రాంగ్ రూట్ ప్రయాణం

● 107 వాహనాలు స్వాధీనం



తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో గత కొంత కాలంగా హైవేపై రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నట్లు గుర్తించిన పోలీసులు మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి, సీఐ చిన్నగోవిందు, ఎస్ఐలు షేక్ షావలి, రామకృష్ణ, సిబ్బంది కలిసి తనిఖీల్లో పాల్గొన్నారు. రాంగ్ రూట్‌లో, ఆపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలు నడిపిన దాదాపు 107 వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 27 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రూ 1.85 లక్షలు జరిమానా విధించినట్లు సీఐ చెప్పారు.

సీపీఐ నారాయణ హెచ్చరికతో

మద్యం షాపు తరలింపు

స్పందించి ఆరా తీసిన కలెక్టర్... షాపు తరలించాలని ఆదేశం

తిరుపతి/తిరుపతి(నేరవిభాగం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల సాయినగర్ పంచాయతీలో ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంపై సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ చేసిన హెచ్చరికతో మద్యం షాపును అధికారులు మరోచోటకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. నారాయణ ప్రకటన నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆరా తీసి సమస్య పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. దీనికి సంబంధించిన వివరాలిలా వున్నాయి. జిల్లావ్యాప్తంగా కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం 23 మద్యం షాపులు కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా తిరుపతి రూరల్ మండలంలో సీరియల్ నంబరు 20వ షాపును దక్కించుకున్న వ్యక్తులు అవిలాల సాయినగర్ పంచాయతీలో ఫ్రెండ్లీ వైన్స్ పేరిట ఏర్పాటు చేశారు. అయితే షాపు జనావాసాల నడుమ వున్నందున అక్కడి నుంచీ తొలగించాలని కొద్ది రోజులుగా స్థానిక మహిళలు ఆందోళన చేస్తున్నారు. వారికి సీపీఐ నేతలు మద్దతుగా రంగంలోకి దిగారు. ఇటీవల షాపు బ్యానర్లను సైతం తగలబెట్టారు. ఈ నేపథ్యంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మంగళవారం తిరుపతి వచ్చారు. మద్యం షాపు వివాదం గురించి తెలుసుకుని బుధవారం నుంచీ అక్కడే బైఠాయిస్తామని, తొలగించే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ హెచ్చరించారు. ఆ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఆరోపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ విషయం ఏమిటని ఆరా తీశారు. ఇళ్ల మధ్య వైన్ షాపు వద్దని, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నపుడు షాపును అక్కడ నుంచీ మరో చోటకు తరలించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కాగా, సాయినగర్‌లో ఏర్పాటు చేయదలచిన గీత కార్మికుడి ఫ్రెండ్లీ వైన్స్ మద్యం షాపు స్థానిక ప్రజలు, వామపక్ష పార్టీల ఆందోళన నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేయదలచిన దుకాణాన్ని వేరొక చోట ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గీత కార్మికుల కోసం దాదాపు 23 దుకాణాలు కేటాయించామన్నారు. అయితే ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాలేదని సాయినగర్‌లో ప్రజల విజ్ఞప్తి మేరకు అక్కడ నుంచి వేరొక చోట ఏర్పాటు చేసుకునేలా దుకాణం నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశామన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు గమనించాలని కోరారు.